

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



పెద్దకురవపల్లె వద్ద పొలాల్లోనే దోస పంట



రొంపిచెర్ల వారపుసంతలో వాహనాల్లో దోస అమ్మకాలు

నష్టాల బాటలో దోస రైతులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):ఎన్నో ఆశలు పెట్టుకుని సాగు చేసిన దోస పంటకు ధరల్లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.రొంపిచెర్ల మండలంలో వెయ్యి ఎకరాల్లో టమోటా సాగు చేసిన రైతులు దోస పంటను 840 ఎకరాల్లో సాగు చేశారు. మోటుమల్లెల, గానుగచింత,పెద్దమల్లెల,బొమ్మయ్యగారిపల్లె పంచాయతీల్లో దోస సాగు చేసిన రైతులు గత ఏడాది లాభాలు గడించారు.దీంతో ఈ ఏడాది పంట విస్తీర్ణం మరింత పెంచారు.అయితే ధరలు తగ్గిపోవడంతో ఉసూరుమం టున్నారు.ఎకరా దోస సాగుకు కూలీలు, దున్నకాలు, మల్చింగ్‌షీట్, ఎరువులు, మందులు తదితరాలకు రూ. 90వేల నుంచి రూ.లక్ష వరకు అవుతోందని రైతులు చెబుతున్నారు.దీంతో పాటు ఎకరాకు 250 గ్రాముల విత్తనాలు అవసరం. మార్కెట్‌లో కిలో విత్తనాలు రూ.55వేలు పలుకుతోంది. డ్రిప్ వైరు 4కట్టలు అవసరముండగా కట్ట రూ.1500 పలుకుతోంది. పంట దిగుబడుల ప్రారంభదశలో రూ.20 వేలు పలికిన టన్ను పంట ధర ఉన్నపళంగా రూ.5వేలకు పడిపోయింది. కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో కొంతమంది రైతులు పంటను పొలంలోనే వదిలేశారు. మరి కొంత మంది వాహనాల్లో వేసుకొని సంతల్లో, పట్టణాల్లో తిరిగి అమ్ముకుంటున్నారు. కొంత ఆలస్యంగా పంట సాగు చేసిన రైతులు తమ పరిస్థితి ఎలా వుంటుందో అని ఆందోళనలు చెందుతున్నారు.గతంలో ఇక్కడి పంట తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ, హైదరాబాద్ ప్రాంత వ్యాపారస్తులు కొనేవారు. ప్రస్తుతం ఆ రాష్ట్రాల్లో కూడా పంట సాగవుతుండడంతో వ్యాపారులు ఇక్కడికి రావడం లేదు.దీనికి తోడు పంట విస్తీర్ణం కూడా పెరగడంతో ధరలు పడిపోయినట్లు చెబుతున్నారు.

పంట దిగుబడి బాగా వచ్చింది. రంజాన్ మాసంలో డిమాండ్ పెరిగి మంచి లాభాలు వస్తాయని ఆశించాం.అయితే మా అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ధరల్లేకపోవడంతో నష్టాలే మిగిలాయి.

- జ్యోతినాథ్,పెద్దకురవపల్లె





నాకున్న నాలుగు ఎకరాల్లో దోస సాగు చేశా. ఎకరానికి రూ.లక్ష వరకు ఖర్చయింది.ప్రస్తుతమైతే ధరల్లేవు. అలస్యంగా సాగు చేశాను దిగుబడులు వచ్చే సమయం దగ్గర పడుతోంది.అప్పటికి మంచి ధరలు వస్తాయని ఆశిస్తున్నా.

-సిద్ధయ్య, దుస్సావారిపల్లె

ఈ ఏడాది దోస సాగు రెండు రెట్లు పెరిగింది. ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా దోస సాగు సమృద్ధిగా వుండడంతో ఎగుమతులు తగ్గాయి.దీనికి తోడు ఇక్కడ పంట దిగుబడులన్నీ ఒకే సమయంలో రావడంతో ధరలు పతనమయ్యాయి.

- సంతోషికుమారి, ఉద్యానశాఖాధికారిణి



ముగిసిన టెన్త్ 'స్పాట్'

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల మూడో తేదీన మొదలైన పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) బుధవారం ముగిసినట్లు డీఈవో, క్యాంపు అధికారి వరలక్ష్మి తెలిపారు. పాఠశాల విద్య రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలతో వివిధ జిల్లాల నుంచి టెన్త్ పరీక్షలకు సంబంధించి అన్ని సబ్జెక్టులవి 1,74,808, ఓపెన్ స్కూల్‌కు చెందినవి 16,232 జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయన్నారు. వీటిని ఏడ్రోజులపాటు ఇద్దరు అసిస్టెంట్ క్యాంపు అధికారులు, 107 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 616 అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకనం చేశారన్నారు. 208 మంది స్పెషల్ అసిస్టెంట్లుగా వ్యవహరించినట్లు వివరించారు.

ఐటీఐలో ప్రైవేటుగా పరీక్షలకు హాజరుకావచ్చు

- అర్హులనుంచి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఐటీఐలో ప్రైవేటుగా పరీక్షలకు హాజరు కావడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. బుధవారం విజయపురం మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐలో ఆయన మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరానికి ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఫిట్టర్, వెల్డర్, డీజిల్ మెకానిక్ ట్రేడుల్లో ప్రైవేటుగా పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన మాజీ శిక్షణార్థులు, సీవోఈ పథకం కింద ప్రస్తుత శిక్షణార్థులు, ఎస్‌సీవీటీ అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 11వ తేదీనాటికి 21 సంవత్సరాలు పూర్తయి, ఏదైనా సంస్థలో మూడేళ్ల అనుభవం కలిగినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తిఉన్నవారు ఈనెల 12వ తేదీ సాయంత్రంలోపు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

విజయవాడకు డీఈవో కార్యాలయ సిబ్బంది

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఇటీవల ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసిన విషయం తెలిసిందే. దీనిపై సవరణలు చేయడం, రానున్న డీఎస్సీ నోటిఫికేషన్ తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై విజయవాడలో జరిగిన సమావేశానికి డీఈవో కార్యాలయం నుంచి ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, ఓ జూనియర్ అసిస్టెంట్‌తోపాటు ఏఎస్‌వో, ఏపీవో వెళ్లారు. ఇదిలా ఉండగా, నాల్గవ జోన్ పరిధిలోని ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కడపకర్నూలు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లు గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టుల పదోన్నతికి తాత్కాలిక సీనియారిటీ జాబితాను బుధవారం ఆర్జేడీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. వీటిపై అభ్యంతరాలను తగిన ఆధారాలతో ఆదివారంలోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

తవణంపల్లె @40.1 డిగ్రీలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు తల్లడిల్లుతున్నారు. అత్యధికంగా బుధవారం తవణంపల్లె కేంద్రంలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.నగరిలో 38.3డిగ్రీలు, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 38.1, నింద్రలో 37.7, ఎస్‌ఆర్‌పురంలో 37.3, జీడీ నెల్లూరులో 37, పులిచెర్ల, వెదురుకుప్పం, పూతలపట్టు మండలాల్లో 36.7, రొంపిచెర్ల, సోమల మండలాల్లో 36.5, సదుంలో 36.4, శాంతిపురం, గుడుపల్లె మండలాల్లో 36.3, చౌడేపల్లె, విజయపురం, ఐరాల, పాలసముద్రం, పెనుమూరు మండలాల్లో 36.2, యాదమరిలో 36, గంగవరం, పెద్ద పంజాణి మండలాల్లో 35.8, బంగారుపాళ్యంలో 35.7, కార్వేటినగరంలో 35.2. పుంగనూరులో 34.1,వి.కోట, కుప్పం, బైరెడ్డిపల్లె మండలాల్లో 33.9. రామకుప్పంలో 33.8, పలమనేరులో 33.7 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎస్వీసెట్‌లో సినీసందడి

వేడుకగా అర్జున్ సన్నాఫ్ వైజయంతి ఆడియో లాంచ్









హీరోయిన్ సాయి మంజ్రేకర్ ప్రసంగం - హీరో కళ్యాణ్ రామ్ అభివాదం - నటి విజయశాంతి నమస్కారం - విద్యార్థినుల కేరింతలు

పూతలపట్టు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తల్లీ, కొడుకుల మధ్య అనుబంధాన్ని తెలియజేసే సినిమా అర్జున్ సన్నాఫ్ వైజయంతి అని హీరో నందమూరి కళ్యాణ్‌రామ్ అన్నారు. పూతలపట్టు మండలం ముత్తిరేవుల సమీపాన గల శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎస్వీసెట్)లో బుధవారం సాయంత్రం అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా ఆడియో లాంచ్ కార్యక్రమాన్ని విద్యార్థుల కేరింతల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమంతా అమ్మలకు రుణపడి వుండాలన్నారు. అనంతరం సీనియర్ నటి విజయశాంతి మాట్లాడుతూ తన బిడ్డ లాంటి కళ్యాణ్‌రామ్‌తో కలసి ఈ చిత్రంలో నటించడం చాలా సంతోషదాయకమన్నారు.నటుడు పృథ్వి అలియాస్ బబ్లూ మాట్లాడుతూ ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ తమ తల్లికి థ్యాంక్స్ చెప్తారన్నారు. అంతకుమునుపు చిత్రంలోని రెండవ పాట 'ముచ్చటగా బంధాలే'ని విడుదల చేశారు. అనంతరం కళాశాల ఛైర్మన్ రావూరి వెంకటస్వామి,చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా మంచి విజయం సాధిస్తుందని చెప్పారు.హీరో కళ్యాణ్‌రామ్‌ను, నటి విజయశాంతిని సన్మానించారు.హీరోయిన్ సాయి మంజ్రేకర్, దర్శకుడు చిలుకూరి ప్రదీప్, నిర్మాతలు అశోక్‌వర్ధన్, సునీల్ బాలు, ఎడిటర్ తమ్మిరాజు, కెమెరామెన్ రామ్‌ప్రసాద్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కళాశాల వైస్ ఛైర్మన్ రావూరి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథ రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ ఫంక్షన్ చూడ్డానికి చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి జనం తరలిరావడంతో కళాశాల ఆవరణలో సందడి వాతావరణం నెలకొంది.పలు సినిమా పాటలకు విద్యార్థులు వేసిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి.

శిక్ష అనంతరం ఖైదీలకు రుణాలు

- కలెక్టర్ హామీ

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శిక్ష అనంతరం సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు ఆర్థికంగా ఎదగడానికి సంకల్ప స్కిల్ ట్రైనింగ్ కింద వివిధ శిక్షణలు అందిస్తాం. ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తాం' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. స్థానిక జిల్లా జైలులో ఖైదీలకు సంకల్ప- స్కిల్ ట్రైనింగ్ కింద మల్టీ స్కిల్ ట్రేడ్ కింద శిక్షణ పొందిన వారికి కలెక్టర్ బుధవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నైపుణ్యం కలిగిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఏసీ మెకానిక్ వంటి వృత్తులవారు నైపుణ్యాన్ని పెంచుకుని ఆర్థికంగా సమాజంలో ఎదుగుతున్నారన్నారు. భవిష్యత్తులో ఖైదీలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ సూచనలతో ఖైదీలకు ఫిబ్రవరి 18 నుంచి మార్చి 24వ తేదీవరకు వివిధ శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. జైలులో మహిళా ఖైదీలు ఉన్నారని, వారికి టైలరింగ్ వృత్తిలో శిక్షణ అందిస్తే భవిష్యత్తులో ఉపాధి కల్పించినట్లు అవుతుందని కలెక్టర్‌ను కోరారు. త్వరలో ఓపెన్ క్లాస్ ద్వారా పదో తరగతి శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి గుణశేఖర్ రెడ్డి, న్యాక్ ఏడీ సతీష్, జైలు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ పొందిన ఖైదీలకు సర్టిఫికెట్లను అందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

పలమనేరులో జడ్పీ నిధులపై రగడ

- మండల సమావేశం నిరవధిక వాయిదా
- గత సమావేశాలపై విచారణకు డిమాండ్
- ఎంపీడీవోను సరెండర్ చేయాలని నిర్ణయం

పలమనేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో జడ్పీ నిధుల ఖర్చుపై వివాదం నెలకొంది. మండలంలో ఒకరిద్దరు తప్ప మిగిలిన వారంతా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీచేసి గెలిచిన వారే కావడంతో మండలంలో అభివృద్ధి పనుల కేటాయింపు విషయం అధికారులకు కత్తిమీద సాములా మారింది. మిగిలిన మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ రెండు పార్టీల నేతలు పనుల విషయంలో సమన్వయంతో వ్యవహరిస్తున్నందున ఈ సమస్య తలెత్తడంలేదు. పలమనేరులో మాత్రం వైసీపీ, టీడీపీ నేతల మధ్య సమన్వయం లేక అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో జరగక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బుధవారం పలమనేరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీపీ రోజా, జడ్పీటీసీ మల్లిక, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేశారు. మండలంలో ప్రజాసమస్యల పరిష్కారానికి ఎంపీడీవో సహకరించడం లేదని ఆరోపించారు.అంతకుముందు జరిగిన మండల మీట్‌లో సమావేశాన్ని నిరవధిక వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ రోజా ప్రకటించారు.మండల సమావేశాల్లో తీర్మానించిన అంశాల అమలులో నిర్లక్ష్యం వహించడంతో పాటు తాము గత సమావేశాన్ని వాయిదా వేయగా దాన్ని సభ్యులు బహిష్కరించారని జిల్లా అధికారులకు నివేదిక పంపిన ఎంపీడీవో ఖాదర్‌బాషాను జడ్పీకి సరెండర్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.గత రెండు సమావేశాలపై జిల్లా అధికారులు విచారణ జరపాలని మినిట్స్‌బుక్‌లో నోట్ చేసి సమావేశాన్ని నిరవధిక వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ పేర్కొన్నారు.పలమనేరు మండలానికి గతంలో జిల్లా పరిషత్ ద్వారా మంజూరైన నిధులతో రాజకీయ విభేదాల కారణంగా పనులు చేపట్టలేదు.ఇటీవల కలెక్టర్ జడ్పీ నిధులతో మంజూరు చేసిన పనులను రద్దుచేసి తాగునీటి పనులకే ప్రాధాన్యమివ్వాలని, పనులు శాఖాపరంగా మాత్రమే చేపట్టాలని ఆదేశించారు. అయితే ఎంపీడీవో అధికార పార్టీ నేతలకు వర్క్ ఆర్డరు ఇవ్వడంతో వైసీపీకి చెందిన ఎంపీపీ సహా ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహించారు. నేతల ఆదేశాల మేరకే పనుల నిర్ణయం తీసుకున్నానని ఎంపీడీవో వివరణ ఇచ్చారు.గత సమావేశం వాయిదా వేసినట్టు చెప్పినప్పటికీ మినిట్స్ బుక్‌లో ఆమోదించినట్టు ఎలా రాస్తారని ఎంపీడీవోను నిలదీశారు. అయితే ఆ సమావేశానికి తాను హాజరు కాలేదని సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారని ఎంపీడీవో చెప్పినా సభ్యులు పట్టించుకోలేదు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రోజా

ప్రయాణికులను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్ల స్వాధీనం

వెదురుకుప్పం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలోని కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నాలుగు ట్రాక్టర్లలో ప్రయాణికులను తరలిస్తుండగా పోలీసులు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఈ నాలుగు ట్రాక్టర్లను నగరి మోటారు వెహికల్ అధికారికి అప్పగించామని కార్వేటినగరం ఎస్‌ఐ పి.రాజ్‌కుమార్ తెలిపారు.



ట్రాక్టర్‌లోని ప్రయాణికులు

రేపు ఉద్యాన పంటలపై అవగాహన సమావేశం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎన్‌పీసీ పెవిలియన్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉద్యాన పంటలపై అవగాహన సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మామిడి కొనుగోలు, అమ్మకందారులు తప్పక హాజరు హాజరుకావాలన్నారు.

ఒంటిమిట్ట కోసం లడ్డూలు సిద్ధం



ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తులకు అందించేందుకు తిరుమలలో శ్రీవారి లడ్డూలు సిద్ధం చేశారు. డిప్యూటీఈవో(జనరల్) శివప్రసాద్, ఏఈవో బాలరాజు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది శ్రీవారిసేవకులు 70 వేల లడ్డూలను బుధవారం సిద్ధం చేశారు. 11న ఒంటిమిట్టలో జరిగే కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఈ లడ్డూను ప్రసాదంగా అందజేయనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో ప్రముఖులు



కొల్లు రవీంద్ర - ప్రజ్ఞానంద సరస్వతి

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి కొల్లు రవీంద్ర, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, పెను గొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్,దివ్వెల మాధురి, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఉన్నారు. దర్శనం అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరామనవమి సందర్భంగా ఒంటిమిట్టలో రాష్ట్ర కార్యక్రమంగా జరగాల్సిన కళ్యాణోత్సవాలను గత ఐదేళ్లూ నామమాత్రంగా చేశారని విమర్శించారు. తిరిగి అత్యంత వైభవంగా రాములవారి కల్యాణోత్స వాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు,వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,201

తలనీలాలు సమర్పించినవారు: 21,040





నాడు



నేడు

1970లో శ్రీవారి వసంతోత్సవం- ప్రస్తుతం ఇలా..

శ్రీహరి సేవకు.. తరలిరాద తనే వసంతం

- తిరుమలలో నేటి నుంచి వసంతోత్సవం

తిరుమలేశునికి సేవకు వనమే తరలిరానుందా..వేసవి నుంచి ఉపశమనం కలిగించనుందా.. శ్రీవారి వసంతోత్సవాల్లో అలాంటి దివ్యానుభూతి కలిగించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. వసంతఋతువులో మలయప్పస్వామికి జరిగే ఈ వేడుకను ఉపశమనోత్సవం అని కూడా పిలుస్తుంటారు. క్రీ.శ 1360 నుంచీ ఈఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు శాసనాధారముంది. చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేలా మూడురోజుల పాటు జరిగే వేడుకలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వనమే దిగివచ్చిందా..

ఏటా వసంతోత్సవాలకు ఆలయం వెనుకభాగంలోని వసంతమండపాన్ని విశేషంగా అలంకరిస్తారు. శేషాచల అడవులను తలపించేలా పక్షులు, జంతువులు, వృక్షాలు, చెట్లు, పువ్వుల ఆకృతులతో తీర్చి దిద్దుతారు. ఉత్సవమూర్తులను కొలువుదీర్చే మండపాన్ని దాదాపు 250 కేజీల వట్టివేరుతో అలంకరిస్తారు. 600 కేజీల సంప్రదాయ పుష్పాలు, 10వేల కట్‌ఫ్లవర్స్‌తో సుందరంగా రూపొందిస్తారు. పచ్చని చెట్లు, పుష్పాలతో పాటు పలు రకాల పక్షులు,జంతువుల ప్రతిమలతో వనమే శ్రీవారి సేవకు తరలివచ్చిందా అనిపించేలా ఏర్పాట్లు చేశారు.

స్నపనంతో కన్నులపండుగగా

గురువారం ఉదయం ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానాన్ని నిర్వహిస్తారు. మధ్యాహ్నం స్నపనతిరుమంజనాన్ని ప్రారంభిస్తారు. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహిస్తారు. తర్వాత ఛత్ర చామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపడతారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా స్నపనం చేపడతారు. వీటితో శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరిస్తారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు.

స్వర్ణరథంపై ఉత్సవర్ల అభయం

రెండవరోజు శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి స్వర్ణరథంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈఉత్సవంలో మహిళా ఉద్యోగులు, భక్తులు గోవిందనామస్మరణలు చేస్తూ రథాన్ని లాగుతారు. గంట పాటు మాడవీధుల్లో వైభవంగా ఈవేడుకను నిర్వహిస్తారు. యథావిధిగానే వసంతమండపానికి ఉత్సవమూర్తులను వేంచేపు చేస్తారు. వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు.


యుగ పురుషుల దర్శనం

శనివారం శ్రీవారు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులతో కలిసి దర్శనమిస్తారు. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకిస్తారు. ఒకేవేదికపై సమస్త మూలవరులను ఒకేసారి దర్శనం కల్పించే అపురూప ఘట్టం సాక్షాత్కరిస్తుంది. అందుకే మూడవరోజు ఉత్సవంలో పాల్గొనేందుకు భక్తులు మక్కువ చూపుతారు. వసంతోత్సవాలు ముగిశాక మూడు యుగాల మూర్తులను మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈమూడు రోజుల పాటు 'మేవా' అనే ప్రసాదాన్ని ప్రత్యేకంగా తయారు చేసి వితరణ చేయనున్నారు.

- నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

రోగికి కాదు.. రోగానికి చికిత్స అనే సూత్రంగా హోమియో వైద్యానికి గుర్తింపు ఉంది. దుష్ప్రభావాలు లేకుండా దీర్ఘకాలిక వ్యాధులనైనా నయం చేయగల వైద్యప్రక్రియగా ప్రజలు విశ్వసిస్తారు. కొవిడ్ సమయంలో ఈ వైద్యానికి విశేష ఆదరణ లభించింది. తర్వాతా ఎక్కువమంది హోమియో వైపు మొగ్గు చూపుతున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



వ్యాధి మూలానికి మందు ఇదిగో

హోమియో వైద్య విధానానికి పెరుగుతున్న ఆదరణ

దీర్ఘకాలిక రోగాలకూ పరిష్కారం



మంగళంలో ప్రభుత్వ హోమియో వైద్యశాల

జిల్లాలో 11 ప్రభుత్వ హోమియో వైద్యశాలలు ఉన్నాయి. తిరుపతిలోని పాత ప్రసూతి ఆస్పత్రి భవనంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలో హోమియో వైద్యశాల నడుస్తోంది. గతంలో రోజుకు సుమారు 4 వేల మంది వరకు వైద్యం పొందే వారు. ఇప్పుడు ఆ సంఖ్య రెట్టింపైంది. పెరుగుతున్న ఆదరణకు ఇదే నిదర్శనం. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా హోమియోకు ప్రాధాన్యమిస్తూ ఆ ఆస్పత్రుల రూపురేఖలను మారుస్తున్నాయి. ఇప్పటికే తిరుపతి రూరల్ పరిధిలో మంగళంలో పైలట్ ప్రాజెక్టు కింద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పేరుతో ప్రభుత్వ హోమియో వైద్యశాలను ఏర్పాటు చేసింది.

దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోలో చక్కటి పరిష్కారం లభిస్తుందని వైద్యులు చెబుతున్నారు. మందుల ఖరీదూ తక్కువే. జలుబు, దగ్గు నుంచి మైగ్రేన్ తలనొప్పి, మహిళల్లో వచ్చే రుతుక్రమ రుగ్మతలకు, ఆర్థరైటిస్, వెన్నునొప్పి, చర్మ, శ్వాసకోశ వ్యాధులకు, దీర్ఘకాలిక అలసట, హార్మోన్లలో వ్యత్యాసం, జీర్ణ రుగ్మతలకు, అలర్జీలకు హోమియోకు మించిన వైద్యం లేదని రోగులు చెబుతుంటారు. హోమియో మందు ఒకసారి శరీరంలోకి ప్రవేశిస్తే ఎక్కువ కాలం ప్రభావం ఉంటుంది. వ్యాధి పునరావృతం కాదని వైద్యులు భరోసా ఇస్తున్నారు. సహజ సిద్ధమైన పదార్థాలతో చేసిన మందులు కావడంతో చెడు ప్రభావాలు ఉండవు.

సురక్షితమైన వైద్యం



హోమియోను మించిన సురక్షితమైన వైద్యం ఇంకొకటి లేదు. మందులు ఆలస్యంగా పనిచేస్తాయనేది అపోహ మాత్రమే. వైద్యులు సూచించిన విధంగా వాడితే ఎంతటి వ్యాధికైనా శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రధానంగా మహిళల్లో వచ్చే నెలసరి సమస్యల నుంచి దీర్ఘకాలిక వ్యాధుల వరకు నివారణ మార్గముంది. హోమియో వైద్యానికి అలవాటు పడితే ఇక ఏ వైద్యప్రక్రియనూ ఇష్టపడరు.

- డాక్టర్ ఎం.ఎస్.ప్రసన్న లక్ష్మి, సీనియర్ మెడికల్ ఆఫీసర్, హోమియో వైద్యశాల, మంగళం



తిరుపతిలో సప్తగిరి తల్లి అంత్యక్రియలు

తిరుపతిరూరల్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): సినీనటుడు సప్తగిరి తల్లి చిట్టెమ్మ అంత్యక్రియలు బుధవారం తిరుపతిలోని గోవిందధామంలో నిర్వహించారు. తిరుపతి రూరల్‌మండలం శ్రీనివాసపురం పంచాయతీ తిరుమలనగర్‌వీధిలోని నివాసం వద్ద ఆమె భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు. సప్తగిరిని పరామర్శించారు.

మహిళా అధికారిని వేధించిన కేసులో ఫారెస్ట్ రేంజర్‌కు మూడు నెలల జైలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ ఫారెస్ట్ అధికారిని వేధించిన కేసులో రేంజర్‌కు సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్ మూడు నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2023లో దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫారెస్ట్ బీట్ అధికారిగా పనిచేస్తున్న ఎస్కే అస్మ తున్నీసాతో రేంజర్ బొడ్డు వరప్రసాద్‌రావు అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా వేధింపులకు గురిచేశారు. దీనిపై బాధితురాలు దొరవారిసత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి సూళ్లూరుపేట కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బుధవారం కేసు విచారించిన న్యాయమూర్తి అనిల్ కుమార్ నిందితుడు వరప్రసాదరావుకు మూడు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతికుమార్ కేసు వాదించారు.

పారదర్శకంగా భూసేకరణ

- జేసీ శుభం బన్సల్



సత్యవేడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశ్రామిక అభివృద్ధి కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూసేకరణ ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూసేకరణలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇప్పటికే శ్రీసిటీ పరిధిలో ఏర్పాటు కానున్న ఎల్‌జీ పరిశ్రమకు 360 ఎకరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. దీనికి అవసరమైన 220 ఎకరాలను రైతులనుంచి సేకరిస్తుండగా, మిగిలిన భూములను శ్రీసిటీ నుంచి తీసుకున్నట్లు చెప్పారు. దీంతో పాటు మరో 2,580 ఎకరాలకు సంబంధించి భూసేకరణ కోసం ప్రభుత్వం గెజిట్ విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఈ ప్రక్రియకూడా ప్రారంభమవుతుందన్నారు. భూసేకరణపై గ్రామ సభలుకూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించే విషయంలో ప్రభుత్వం తుది నిర్ణయం మేరకు ప్రకటించనున్నట్లు తెలిపారు. అనంతరం రికార్డుల గదిని పరిశీలించారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

నరసింగాపురంలో ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన





అజయ్, నిఖిత (ఫైల్‌ఫొటో), శ్మశానం వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

చంద్రగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన నిఖిత(17) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పరువు హత్యగా సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం హరిజనవాడకు చెందిన అజయ్, నిఖిత కొద్దికాలంగా ప్రేమించుకుంటున్నారు. నరసింగపురానికి పొరుగున ఉన్న మిట్టపాలెం పంచాయతీ కొత్తూరు హరిజనవాడలోని తన అవ్వ ఇంటికి ఈ యువకుడు తరచూ వచ్చేవాడు. ఈక్రమంలో నిఖిత గర్భం దాల్చింది. ఈ విషయం తెలిసి నిఖిత తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అజయ్‌పై పోలీసులు పోక్సో కేసు పెట్టి జైలుకు పంపించారు. జైలులో ఉన్న అజయ్‌ను చూసేందుకు తరచూ నిఖిత వెళ్లడం తెలిసి తల్లిదండ్రులు గట్టిగా మందలించారు. నెల క్రితం బెయిల్‌పై అజయ్ విడుదలయ్యాడు. అజయ్‌తో నిఖిత మళ్ళీ మాట్లాడుతుండటంతో తల్లిదండ్రులు హెచ్చరించారు. ఈనేపథ్యంలో గత శుక్రవారం ఇంట్లో నిఖిత మృతి చెందింది. గంటల వ్యవధిలోనే ఈమె మృతదేహానికి దహనక్రియలు నిర్వహించారు. ఆమె మృతి ఆలస్యంగా వెలుగులోకి రావడంతో బుధవారం డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి సిబ్బంది నరసింగాపురం గ్రామానికి వెళ్ళి మృతురాలి తల్లిదండ్రులను విచారించారు. దహనం చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. దీనిపై సీఐను వివరణ కోరగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఆ మాటలేంటి జగన్?

- ఇకనైనా శవరాజకీయాలు మానుకో అన్న మంత్రి కొల్లు



తిరుపతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీసులను బట్టలూడదీసి కొడతానని వైసీపీ అధినేత జగన్ బెదిరించడం చూస్తే అతనిపై క్రిమినల్ కేసు పెట్టాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అధికారులను భయపెట్టేలా మాటలేంటంటూ మండిపడ్డారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఆయన.. ఇప్పుడు అదే పోలీసులు రక్షణగా వస్తే వారిని అవమానపరిచేలా మాట్లాడటం మంచిది కాదన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తే జగన్ బయటకు వచ్చేఆరు కాదన్నారు. వైసీపీ హయాంలో ఏ చిన్న కార్యక్రమం చేయాలన్నా తమను హౌస్ అరెస్టులు చేసేవారని గుర్తుచేశారు. ఇప్పుడలా చేయడం లేదన్నారు. వైసీపీలో జరిగిన అక్రమాలపై లోతైన విచారణ జరుగుతోందని, అందుకే ఆలస్యం కావచ్చేమోగానీ ఎవరూ తప్పించుకోలేరన్నారు. కేసుల్లో ఉన్నవారు ముందుగానే బెయిల్‌కోసం ప్రయత్నిస్తున్నారంటే వారి ప్రమేయం ఉంటుందన్న అనుమానం కలుగుతోందన్నారు. అనంతపురం జిల్లాలో ఒక కుటుంబ తగాదాల్లో చనిపోయిన వ్యక్తిని శవ రాజకీయం చేశారని విమర్శించారు. ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు రాకూడదని కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ఢిల్లీకి వెళ్లి ఏపీలో శాంతిభద్రతలు లేవని నానా యాగీ చేసిన జగన్.. ఇప్పుడు శవరాజకీయాలు ఎత్తుకున్నారని విమర్శించారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఏపీ రెండోస్థానంలో నిలవడం చంద్రబాబు పనితీరుకు నిదర్శనమన్నారు. వైసీపీ పాలనలో జీడీపీ పూర్తిగా పడిపోతే దానిని పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, సుగుణమ్మ, శాప్ చైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, మహేష్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు, కృష్ణ యాదవ్, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తమ వర్గం కౌన్సిలర్లతో ఎంపీ గురుమూర్తి, రాంకుమార్‌రెడ్డి తదితరులు

భానుప్రియపైనే విశ్వాసం

- మెజారిటీ కౌన్సిలర్ల మద్దతు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై మెజారిటీ కౌన్సిలర్లు విశ్వాసం ప్రకటించారు. వైసీపీకే చెందిన దొంతు శారద వర్గం 16 మంది కౌన్సిలర్లతో గత నెల 26వ తేదిన కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అవిశ్వాస తీర్మానంపై వినతి పత్రం అందించారు. ఈ క్రమంలో బుధవారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరిగింది. ఈ మధ్యలో వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లను బుజ్జగించారు. మొత్తం 19 మందిని క్యాంప్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, 10.30 నుంచి 12గంటల మధ్య అవిశ్వాస తీర్మానంపై సమావేశాన్ని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ప్రొసీడింగ్ అధికారిగా నిర్వహించారు. 11గంటలకు 19 మంది కౌన్సిలర్లు నేరుగా మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చారు. వీరు వైసీపీకే చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియకు అనుకూలంగా మద్దతు తెలిపింది. కాగా, దొంతు శారద వర్గం సమావేశానికి రాలేదు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు, ప్రత్యేక పోలీసు సిబ్బంది పటిష్టమైనా బందోబస్తు ఏర్పాటు చేశారు.

సరిహద్దుల్లో నిఘా పెంచండి

- అక్రమ మద్యం కట్టడి చేయాలన్న మంత్రి కొల్లు
- తిరుపతిపై ఫోకస్ పెంచాలన్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులున్నాయి. ఇక్కడ నిఘా పెంచండి. గంజాయి, నాటుసారా, మాదక ద్రవ్యాలు రాకుండా పూర్తిగా కట్టడి చేయాలి' ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో బుధవారం జరిగిన ఎక్సైజ్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తిరుపతిలో ఎక్కువగా విద్యాసంస్థలు ఉన్నందున ఇక్కడ ఎక్కువగా ఫోకస్ పెట్టాలి. మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కాకుండా చూడాలి' అని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్లు నిషాంత్‌కుమార్, రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. చిత్తూరు జిల్లాలో దాదాపు 70 సారా తయారీ కేంద్రాలను గుర్తించామని అక్కడ పూర్తిగా కనిపించకుండా చేయడానికి తీసుకుంటున్న చర్యలపై ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ వివరించారు. అవి కూడా లేకుండా గట్టిగా పనిచేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ డీసీ విజయశేఖర్, ఎక్సైజ్ ఈఎస్‌లు నాగమల్లేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, డిస్టలరీ ఈఎస్ జానకిరాం, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, ఊహశ్రీ, అన్ని జిల్లాల డీసీలు, ఈఎస్‌లు, ఏఈఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.






ప్రకృతి సోయగం

చిత్తూరు నగరంలోని ఎంఎస్ఆర్ కూడలి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో కనిపిస్తున్న ఈ చెట్లు చూపరులకు కనువిందు చేస్తున్నాయి.చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గతంలో నాటిన మొక్కలు ఇలా ఎదిగి పుష్ప సౌందర్యాన్ని పంచుతున్నాయి.అన్ని రోడ్లలో కూడా ఇలా మొక్కలను పెంచితే పర్యావరణం బాగుండడంతో పాటు పచ్చదనాన్ని నగరవాసులు ఆస్వాదించే అవకాశం వుంటుంది.

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు

చిత్తూరు ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

● ఆర్టీసీ బస్సులో ఎందుకు ఎక్కించుకోరు..?
● పునరావృతం కాకుండా చూడాలని పీటీడీవోకు ఎమ్మెల్యే జగన్మోహన్ సూచన

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 'చిత్తూరు ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు. ఆర్టీసీ బస్సులో ఎందుకు ఎక్కించుకోరు? అవసరమైతే రవాణాశాఖ శాఖ మంత్రితో మాట్లాడతా. ఇటువంటివి పునరావృతం కాకుండా చూడండి' అని పీటీడీవో జగదీష్‌కు ఎమ్మెల్యే జగన్మోహన్ ఫోన్ చేసి సూచించారు. చిత్తూరుకు చెందిన ఓ యువకుడు చెన్నైలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వారాంతపు సెలవు కావడంతో చిత్తూరుకు రావడానికి ఈనెల ఐదో తేదీన అర్ధరాత్రి 12 గంటల సమయంలో వేలూరు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. అక్కడ ఆర్టీసీ బస్సు (సప్తగిరి ఎక్స్‌ప్రెస్) ఉంటే ఎక్కడానికి వెళ్లాడు. చిత్తూరు అయితే ఎక్కొద్దని ఆ బస్సు కండక్టర్ చెప్పాడు. బతిమిలాడినా, వాగ్వాదానికి దిగినా ససేమిరా అన్నాడు. చేసేదేమీ లేక ఆ యువకుడు మరో రెండు గంటలపాటు వేచి ఉండి ప్రైవేటు బస్సులో చిత్తూరుకు చేరుకున్నాడు. ఈ ఘటనపై మరుసటి రోజున ఉదయం డీపీటీవోకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై 'చిత్తూరా..? అయితే ఎక్కొద్దు' శీర్షికన ఈనెల ఆరో తేదీన ఆంధ్రజ్యోతిలోనూ కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే ఈ మేరకు పీటీడీవోకు బుధవారం ఫోన్ చేసి, సూచనలిచ్చారు.

ఎంపీ దగ్గుమళ్ల కృషితో నెరవేరిన కల

● తిరుపతి - కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్‌కు కేంద్ర మంత్రివర్గ ఆమోదం

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కృషితో చిత్తూరు అభివృద్ధికి కీలక అడుగు పడింది. తిరుపతి - కాట్పాడి డబుల్ లైన్ ఏర్పాటుకు కృషి చేస్తామని ఎన్నికల సందర్భంగా ఎంపీ హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా పలుమార్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కలసి చర్చించారు. అంతేకాక పార్లమెంటులోనూ ప్రస్తావించి, లిఖిత పూర్వకంగా వినతిపత్రాలు సమర్పించారు. ఎంపీ కృషి ఫలించి తిరుపతి - కాట్పాడి వయా చిత్తూరు రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుకు కేంద్రం రూ.1332 కోట్లు మంజూరు చేసింది. 104 కి.మీల డబుల్ లైన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. గతంలో చిత్తూరు రైల్వేస్టేషన్‌లో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇకపై ఆగనున్నాయి. పుణ్యక్షేత్రాలకు నిలయమైన తిరుపతి, తిరుచానూరు, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ వంటి ప్రముఖ ఆలయాలను సందర్శించే భక్తులకు కేంద్ర రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం సౌలభ్యంగా మారింది. అంతేకాక తిరుపతి- కాట్పాడి రైల్వేలైన్ ఏర్పాటుతో చిత్తూరు టూరిజం హబ్‌గా మారే అవకాశం ఉంది. రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీకి బుధవారం పలువురు కూటమి నేతలు, ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. వీరిలో.. చంద్రగిరి, చిత్తూరు, పూతలపట్టు, జీడీ నెల్లూరు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, కలికిరి మురళీ మోహన్, థామస్, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఉపాధ్యక్షుడు కాజూరు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఎంపీకి ధన్యవాదాలు తెలుపుతున్న కాజూరు శ్రీనివాస్ తదితరులు

రైల్వే రక్షణ సిబ్బందికి మౌలిక వసతులు

ప్రిన్స్‌పల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్

తిరుపతి(సెంట్రల్) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో రైల్వే రక్షణ దళ సిబ్బందికి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు ప్రిన్స్‌పల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ వెల్లడించారు. తిరుపతిలోని ఆర్పీఎఫ్ బ్యారెక్స్ వద్ద బుధవారం డ్రై క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించారు. జోనల్ కేంద్రమైన సికింద్రాబాదుతో పాటు విజయవాడ, తిరుపతి కేంద్రాల్లో క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. మన్మాడ్, గుంటూరు, గుంతకల్లు రైల్వేస్టేషన్లలో కూడా ప్రారంభిస్తామన్నారు. ఈ క్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేసిన ఐపీఎఫ్ మధుసూదన్‌ను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు టి.మురళీకృష్ణ, కె.రాజగోపాల్‌రెడ్డి, జీఆర్పీ డీఎస్పీ హర్షిత, ఐపీఎఫ్‌లు కె.మధుసూదన్, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.



తిరుపతిలో ఆర్పీఎఫ్ డ్రై క్యాంటీన్‌ను ప్రారంభించిన అరోమాసింగ్ ఠాకూర్

యువతిని వేధించిన యువకుడిపై కేసు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యువతిని వేధింపులకు గురి చేసిన యువకుడిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు...పుంగనూరు మండలంలోని గాంధీపురానికి చెందిన గిరి ఓ యువతి(20)ని ప్రేమించమంటూ వేధిస్తుండేవాడు. మంగళవారం ఆమె ఇంటి వద్దకు వెళ్లి తనను ప్రేమించకపోతే తన ద్విచక్రవాహనానికి నిప్పు పెడతానని బెదిరించి భయాందోళన సృష్టించాడు. వాహనానికి నిప్పు పెట్టి గ్రామస్తులు రావడంతో పారిపోయాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు.

మరమ్మతుల పేరుతో అండర్‌బ్రిడ్జిల మూసివేత

ఇబ్బంది పడుతున్న ప్రజలు



అండర్‌బ్రిడ్జిని మూసివేస్తున్నట్లు రైల్వే అధికారుల బోర్డు

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై-ముంబై రైల్వే లైన్ల లో భాగంగా తడు కు సమీపంలో ఏర్పాటు చేసిన అండర్‌బ్రిడ్జిలకు మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో రెండు నెలలు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో అండర్‌బ్రిడ్జి ద్వారారాకపోకలు సాగించే తడుకు, ఎగువ గూలూరు, దళితవాడ, దిగువ గూలూరు, శిరుగురాజపాలెం, పొట్టిగుట్ల గ్రామాల ప్రజలు నానావస్థలు పడుతున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించడానికి లేకుండా మూసివేశారు. ప్రత్యామ్నాయ మార్గం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులకు పదోన్నతులు కల్పించండి

మంత్రికి ఎక్సైజ్ కానిస్టేబుళ్ల వినతి

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్హులకు పదోన్నతులు కల్పించాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. అధికారిక పర్యటనలో భాగంగా బుధవారం తిరుపతికి విచ్చేసిన ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆశాఖ కమిషనర్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల జరిగిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ పదోన్నతుల్లో అడ్‌హాక్ అనే లొసుగును వాడుకుని కనీసం మూడేళ్లు కూడా సర్వీస్ పూర్తి చేయని జూనియర్ అసిస్టెంట్‌లు నేరుగా సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోషన్ తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల సుమారు 30 ఏళ్ల సర్వీస్ పూర్తయిన హెడ్ కానిస్టేబుళ్లకు ప్రమోషన్లు రావడం లేదన్నారు. దీనిపై మంత్రి న్యాయం చేయాలని కోరారు. మంత్రిని కలసిన వారిలో.. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



మంత్రి కొల్లు రవీంద్రను సన్మానిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుళ్ల యూనియన్ నేతలు

అతడి అక్రమార్జన రూ.2.7 కోట్లు

ఏసీబీ సోదాల్లో తేలిందన్న అధికారులు

పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య అరెస్టు ● రెండో రోజూ కొనసాగిన తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్యకు ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు తేల్చారు. తమ సోదాల్లో ఇప్పటి వరకు అతడు 2,70,62,206 రూపాయలు అక్రమార్జనకు పాల్పడినట్లు తేలిందని బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా మహేశ్వరయ్య ఓ బిల్లు చెల్లింపునకు చిన్నగొట్టిగల్లు మండలం పాలెం గ్రామానికి చెందిన దినేష్‌రెడ్డిని నగదు డిమాండు చేశారు. ఆయన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు గత ఫిబ్రవరిలో రంగంలోకి దిగారు. రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా మహేశ్వరయ్యను పట్టుకుని అరెస్టు చేశారు. ప్రభుత్వం ఆయన్ను సస్పెండు చేసింది. ఇటీవల బెయిల్‌పై వచ్చారు. ఆ కేసు దర్యాప్తులో భాగంగా ఆదాయానికి మించి ఆస్తులను మహేశ్వరయ్య కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో తిరుపతి ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి పలమనేరు, గంగవరం, కడప జిల్లా బద్వేలు, బెంగళూరులో మంగళవారం సోదాలు జరిపారు. బుధవారమూ కొన్నిచోట్ల ఈ తనిఖీలు జరిగాయి. తిరుపతి రూరల్ పేరూరులోని ఆయన ఇంట్లో మొత్తం ఒకటిన్నర కిలో బంగారం, కిలో వెండి, రూ.35 లక్షల బ్యాంకు టర్మ్ డిపాజిట్లు, రూ.ఎనిమిది లక్షల నగదు గుర్తించి.. సీజ్ చేశారు. ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఇలా పలుచోట్ల ఆస్తులకు సంబంధించి 20 నుంచి 25 డాక్యుమెంట్లను అధికారులు సీజ్ చేశారు. బంధువులు, స్నేహితులు బినామీలుగా పలు బ్యాంకు ఖాతాలు, లాకర్లు ఉన్నట్లు గుర్తించిన వీరు.. త్వరలో వాటిని తెరిచేందుకు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శిగా నెలవారీ జీతం తక్కువగా ఉన్నా.. ఇంట్లో ఖరీదైన ఫర్నిచర్ ఉన్నట్లు గుర్తించారు. అక్రమార్జనకు పాల్పడినట్లు తేలడంతో మహేశ్వరయ్యను అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఆయన్ను మళ్లీ కస్టడీకి తీసుకుని విచారించడానికి అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



మహేశ్వరయ్య

అవినీతి అధికారుల సమాచారమివ్వండి

అధికారులు ఎవరైనా లంచం అడిగితే తిరుపతి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయండి. అలాగే, ఆదాయానికి మించి ఆస్తులున్న వారి వివరాలనూ మా దృష్టికి తీసుకురండి. సమాచారం ఇచ్చే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. లంచం ఇస్తే కానీ పనులు చేయమని చెబుతున్న అధికారుల వివరాలు చెబితే వారిపై కేసులు నమోదు చేస్తాం. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ అవినీతి జరిగినా 94404 41630 నెంబరులో ఏఎస్పీ విమలకుమారిని.. లేదా 94404 41690 నెంబరులో డీఎస్పీ జస్సి ప్రశాంతిని సంప్రదించండి. ప్రజల సహకారం ఉంటేనే అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవచ్చు.

- ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి

మ్యాంగో బోర్డు సాధనకు కృషి

ఐరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మాంగో బోర్డు సాధనకు కృషి చేస్తామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం ఐరాల మండలంలోని గుండ్లపల్లె పంచాయతీ వెంకటాపురంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవానికి విచ్చేసిన వారు ప్రసంగించారు. జిల్లాలో ఎక్కువ శాతం రైతులు మామిడి పంటపై ఆధారపడి ఉన్నారన్నారు. వీరిని ఆదుకోవడానికి మ్యాంగో బోర్డును సాధిస్తామని చెప్పారు. మామిడి పల్ప్‌ను టీటీడీ కొనుగోలు చేసేలా చూస్తామన్నారు. సీఎం చంద్రబాబు.. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమానంగా చూస్తున్నారని తెలిపారు. అదే స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై తాము దృష్టి సారించామన్నారు. ప్రజల సంక్షేమమే తమ ఎజెండా అన్నారు. అనంతరం వారు శ్రీరామతీర్థం సేవాశ్రమం, పేయన్నగారిపల్లె ఏడబ్ల్యూ, జి.గొల్లపల్లె బస్టాప్ వద్ద నుంచి పరిసర ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, అంగన్వాడీ కేంద్రం ప్రహరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, టీడీపీ నాయకులు కోదండయాదవ్, గిరిధర్‌బాబు, చందన స్రవంతి, లత, స్వర్ణ, గంగారపు హరిబాబు నాయుడు, కొల్లా రమేష్, శివ, జనసేన నేత పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీ మోహన్

పకడ్బందీగా దూరవిద్యా పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ పరిధిలో దూరవిద్యా పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయని డైరెక్టర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వ కాలేజీల్లోనే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసుల సహకారం తీసుకున్నట్టు చెప్పారు. పరీక్షల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను నియమించామన్నారు.

బట్టలు ఉతుక్కోడానికే పనికొస్తారు



'బట్టలు విప్పదీసి కొడతానన్నారు. రాబోయే రోజుల్లో బట్టలు ఉతుక్కోడానికే మీరు పనికొస్తారు. ఇదిగో, ఈ ఏరియల్, సర్ఫ్‌ఎక్సెల్, రిన్ ప్యాకెట్లను లోటస్‌పాండ్‌కి, బెంగళూరు.. తాడేపల్లి ప్యాలెస్‌కు, పులివెందులకు పంపిస్తాం. నిన్ను, నీ పార్టీని గతేడాది రాష్ట్ర ప్రజలు బండకేసి ఉతికి.. ఆరేసి 11 స్థానాలకు పరిమితం చేసినా ఇంకా జ్ఞానం రాలేదు' అంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌పై టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గుడ్డలు ఊడదీసి కొడతామంటూ పోలీసుల ఆత్మస్థైర్యం.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన జగన్, వారికి క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. పోలీసు సెక్యూరిటీ లేకుండా మీరు ప్రజల్లోకి రాగలరా అని ప్రశ్నించారు. పోలీసుల బట్టలు కాదు.. కొన్నిరోజులు పోతే మీ డ్రెస్సే మారుతుందని, ఓ ప్రత్యేకమైన నంబర్ కూడా మీకు వస్తుందని ప్రజలు అంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకులు వరప్రసాద్, పొనగంటి భాస్కర్, నవీన్‌రాయల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆంధ్రజ్యోతి

తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు

● దామినేడు వద్ద 34 ఎకరాల కేటాయింపు
● రూ.1,500 కోట్ల అంచనాతో ఏర్పాటుకానున్న అకాడమీ

తిరుచానూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని దామినేడు లెక్కదాఖలా సర్వే నెంబరు 193/9 నుంచి 207/21 వరకు ఉన్న 34.70 ఎకరాలు కేటాయిస్తూ ఆమోద ముద్ర వేశారు. ఒలంపిక్స్ ప్రమాణాలతో 38 రకాల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహించేలా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు ఏర్పాటు కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో రూ.1,500 కోట్లతో స్పోర్ట్స్ అకాడమీకి శాప్ రూపకల్పన చేసింది. శాప్ ఎండీ నుంచి బుధవారం జిల్లా యంత్రాంగానికి స్థల కేటాయింపుల కోసం ప్రతిపాదనలందాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కాంప్లెక్సుకు కావాల్సిన భూమికి సంబంధించిన పత్రాలను రెండు మూడు రోజుల్లో శాప్‌కు అందజేయనున్నట్లు తెలిసింది. కాగా, పలు అకాడమీలను ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు వెల్లడించారు. గ్రామీణ క్రీడాకారులూ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఈ క్రమంలో స్పోర్ట్స్ కాంప్లెక్సుకు ఆమోదం లభించడం సంతోషంగా ఉందన్నారు.



దామినేడు వద్ద ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీకి కేటాయించిన స్థలం

ఏం ఉంటాయంటే..

దక్షిణాది రాష్ట్రాల్లో బెంగళూరు వేదికగా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు ఉంది. ప్రస్తుతం తిరుపతిలో ఏర్పాటు కానున్న ఈ అకాడమీలో 500 సీట్ల సామర్థ్యంతో ప్రోకబడ్డీ, 500 సీట్ల సామర్థ్యంతో ఫుట్‌బాల్, హాకీ, జిమ్నాస్టిక్, ఖోఖో వంటి పలు అకాడమీలు ఏర్పాటు కానున్నాయి. రన్నింగ్ ట్రాక్‌నూ ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 38 రకాల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అకాడమీలు ఏర్పాటు కాబోతున్నాయి.

ప్రయాణికులకు అందుబాటులో ఆర్టీసీ సేవలు


డిపో మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు అందుబాటులో ఆర్టీసీ సేవలు ఉండాలని.. ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి డిపో మేనేజర్ టీకే స్వామికి సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో సమీక్షించారు. డిపోకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని.. ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇక్కడి నుంచి తరలించిన బస్సు సర్వీసులు త్వరలోనే తిరిగి పునరుద్ధరించేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఈనెల 10న బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం, దాసార్లపల్లి సర్వీసును ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యేకు తెలిపారు.

వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యాలు


టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గడిచిన వైసీపీ ఐదేళ్ల పాలనలో గొంతెత్తిన టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యాలు, అక్రమ కేసులు బనాయించారని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ బంగ్లా ఆవరణలో బుధవారం రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లోని టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకులు పెట్టిన అక్రమ కేసులకు భయపడకుండా గత ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు చేసిన పోరాటాన్ని ఎన్నటికీ మరువలేనన్నారు. కార్యకర్తలే టీడీపీకి బలమని, కార్యకర్తలకు అందించే సభ్యత్వ కార్డులే వారికి అసలైన గుర్తింపు అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం టీడీపీ సభ్యత్వ కార్డులను చల్లా రామచంద్రారెడ్డి పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, మురళీధర్, ఉయ్యాల రమణ, సుబ్రహ్మణ్యంనాయుడు, నూలు రెడ్డెప్ప, ఇబ్రహీంఖాన్, కుమార్‌రెడ్డి, ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, సుబ్బారెడ్డి, గోపినాయుడు, నారాయణస్వామినాయుడు, షుకూర్, కరుణాకర్‌నాయుడు, నూర్‌బాషా, శంకర్, దేవ, నరేంద్రచౌదరి, చెన్నుపాటి ధన, మహేష్, అనిల్‌కుమార్, అబ్బాస్, మోహన్‌దాస్, రమేష్, ఖాదర్‌వల్లి, అష్రఫ్, రామకృష్ణమనాయుడు పాల్గొన్నారు.

పెరిగిన గ్యాస్ ధరలపై సీపీఎం నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పలమనేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్ యార్డు వద్ద బుధవారం సీపీఎం నాయకులు బుధవారం మధ్యాహ్నం పెరిగిన గ్యాస్ ధరలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గిరిధరగుప్తా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచుకుంటూ పోతుంటే సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండు చేశారు. సీపీఎం నాయకులు రాజా, జయంతి, శ్రీరామయ్య, సుధాకర్, ప్రతాప్, ధనమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి


ఎస్టీవోను కలిసిన సంఘ నాయకులు

పలమనేరు, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లోని సమస్యలు పరిష్కరించాలని.. పలమనేరులోని ఎస్టీవో కార్యాలయం పైఅంతస్థులో ఉందని.. కింద ఉండేలా చర్యలు తీసుకోవాలని పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎస్టీవో రామకృష్ణయ్య ను కోరారు. పలమనేరు ఎస్టీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను బుధవారం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అద్దెభవనంలోని కార్యాలయానికి వృద్ధులైన పెన్షనర్లు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. కార్యాలయం కింది ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నాగభూషణం, రెడ్డిశ్రీనివాసులు, విజయ్‌కుమార్, దామోదరం, రామప్ప, జగదీష్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి వసంతోత్సవం


వీరాంజనేయస్వామికి వసంతోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని హనుమంతరాయదిన్నెలో వెలసిన వీరాంజనేయస్వామికి వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి స్వామి వారికి వేదపండితులతో వసంతోత్సవం నిర్వహించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ప్రభుత్వ ఉద్యోగులను విమర్శించడం దారుణం


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులను మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి విమర్శించడం దారుణమని పుంగనూరు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం పుంగనూరులో టీడీపీ నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ జగన్ పాలనలో పని చేసిన పోలీసు ఉన్నతాధికారులు కోర్టు చుట్టూ తిరుగుతున్నారని గుర్తు చేశారు. సత్యసాయి జిల్లాలోని రామగిరి మండల పర్యటనలో పోలీసులపై మాజీ సీఎం చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వాలు మారుతుంటాయని, ప్రభుత్వాలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులు పని చేయాల్సి ఉంటుందన్నారు. టీడీపీ పరిపాలలో ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బంది పెట్టిన దాఖలాలు లేవన్నారు. సమావేశంలో నాయకులు మధుసూదన్‌రాయల్, అనిల్, సయ్యద్, పర్వేజ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తులసీనాథం నాయుడు దంపతులకు సత్కారం


సత్కారం అందుకున్న తులసీనాథంనాయుడు దంపతులు

గంగవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉగాది పురస్కార గ్రహీత తులసీనాథంనాయుడు దంపతులకు బుధవారం సన్మానం జరిగింది. సంస్కృత విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య కృష్ణమూర్తి, ఆచార్య గార్లపాటి దామోదరంనాయుడు తదితరులు సన్మానించారు.

ఒంటిమిట్ట కోదండ రామాలయానికి కూరగాయల వితరణ


కూరగాయలు పంపుతున్న దాతలు

పలమనేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధమైన ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయానికి బుధవారం కర్ణాటక రాష్ట్రం బంగారు తిరుపతి మార్కెట్ యార్డు నుంచి 12 టన్నుల కూరగాయలతోపాటు 80 వేల నిమ్మకాయలను వితరణగా పంపారు. ఒంటిమిట్ట ఆలయంలో ఈనెల 11న జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు అన్నప్రసాదం కోసం వీటిని అందించారు. స్వామివారి భక్తుడు కాప్పల్లి రవీంద్రరెడ్డి అభ్యర్థన మేరకు కర్ణాటక రాష్ట్రం కోలారు ఎమ్మెల్యే మంజునాథ్ మిత్రబృందం టీటీడీ నుంచి వచ్చిన ప్రత్యేక వాహనానికి పూజలు నిర్వహించి తరలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మంజునాథ్ మిత్రబృందం, దాతలు పాల్గొన్నారు.

నేటి నుంచి సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలం నాగిరెడ్డిపల్లె- తిరుమలనాయనికుప్పం గ్రామాల సరిహద్దులోని సోమేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. 10న గురువారం గంగపూజ, గణపతిపూజ, అంకురార్పణ, 11న రుద్రాభిషేకం, ధ్వజారోహణం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, గిరిజాకల్యాణం, 12న రథోత్సవం, 13న వృషభవాహనం, మొక్కుబడి ఉత్సవం, 14న అగ్నిగుండ ప్రవేశం, వసంతోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

19 నుంచి తీర్థంలో ధనకొండ గంగమ్మ జాతర

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామంలో ధనకొండ గంగమ్మ జాతర ఈనెల 19 నుంచి 21 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 19న ఆలయం వద్ద పొంగళ్లు, అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 20న మొక్కుబడి ఉత్సవం, కుంభాభిషేకం, దీపారాధనలు, 21న అమ్మవారి శిరస్సు జలధి కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి రాళ్లగంగమాంబ బ్రహ్మోత్సవాలు

గుడుపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైల్వేస్టేషన్ క్రాస్ సమీపంలోని నెలకొన్న ప్రసన్న రాళ్లగంగమాంబ భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం. గంగమాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఈ నెల 21 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. పన్నెండు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో 10న అంకురార్పణ, 11న కల్యాణోత్సవం, 12న రథోత్సవం, 13న అశ్వవాహనం, 14న నందివాహనోత్సవం, 15న గజవాహనోత్సవం, 16న హంసవాహనం, 17న శేషవాహనం, 18న పుష్పపల్లకి, నయ్యాండి, 19న సింహవాహనం, పచ్చి గెరిగ, అమ్మ వారి అగ్నిగుండ ప్రవేశం, 20న ప్రాకారోత్సవం, వసంతోత్సవం, 21న పొంగళ్లు, దీపారాధన తదితర ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోజూ అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కుప్పం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం కొత్తపేట పాత రైల్వే గేటు వద్ద సుమారు 30 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మంగళవారం రైలు ఢీకొని రెండు కాళ్లు తెగి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి మృత దేహాన్ని మార్చురీలో భద్రపరిచామన్నారు. తెలుపురంగు జీన్స్ ప్యాంట్, ఎరుపు రంగు బనియన్ ధరించిన మృతుడిని ఎవరైనా గుర్తు పడితే కుప్పం రైల్వే పోలీసులకు, ఫోన్ నంబర్ 9494228854 కు సమాచారం అందించాలని కోరారు.

30 లోపు ఆస్తి పన్నులు చెల్లిస్తే రాయితీ

పలమనేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని ప్రజలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నును ఏప్రిల్ 30 లోపు చెల్లిస్తే 5 శాతం రాయితీ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఈనెలాఖరులోపు పన్నులు చెల్లించి రాయితీ పొందడంతో పాటు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

తల్లీబిడ్డ సంరక్షణే లక్ష్యం


చికిత్సలు అందిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ సంరక్షణే లక్ష్యంగా వైద్యసిబ్బంది పని చేయాలని డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా చికిత్సలు అందించారు. మాతాశిశు మరణాలు జరగకుండా ప్రసవాలు జరగాలని.. ఇందుకు ప్రతిఒక్కరూ గర్భిణుల ఆరోగ్యంపై పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పార్వతమ్మ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: తల్లిపాలు చిన్న పిల్లలకు ఆరోగ్యకరమని వైద్యాధికారి వినయ్ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్‌ఎన్ పార్వతమ్మ, సూపర్‌వైజర్ పంకజాక్షి, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

సమతులాహారంతో ఆరోగ్యం



సదుం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సమతుల్య ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి పేర్కొన్నారు. గురువారం బూరగమంద సచివాలయంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకు కూరలు, కూరగాయలు తినడంతో కలిగే ఆరోగ్యంపై ప్రదర్శనలు, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

● జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ


పలమనేరు : కూర్మాయి వద్ద పంటలను పరిశీలిస్తున్న మురళీకృష్ణ



రొంపిచెర్లలో మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని వ్యవసాయశాఖ అధికారులందరూ ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. బుధవారం పలమనేరులో ఏడు మండలాల వ్యవసాయశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని.. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించాలన్నారు. రానున్న ఖరీఫ్‌లో బీడు భూముల్లో తప్పనిసరిగా విత్తనాలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలన్నారు. పాడిరైతులు గడ్డికి విపరీతంగా యూరియా వాడుతున్నారని.. వారికి ప్రకృతి వ్యవసాయంతో కలిగే లాభాలను వివరించాలన్నారు. ఖరీఫ్‌కు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు మండలాల్లో లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని కూర్మాయి గ్రామంలో దేశీయ వరి వంగడాలతో సాగుచేసిన కుమార్‌రెడ్డి పొలాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. కొలమాసనపల్లి గ్రామంలో ఆగ్రో బయో ఫ్యూచర్ మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రొంపిచెర్లతో అవగాహన

● రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణకార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏపీఎం హరిబాబు, ఏవో సుధారాణి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, సంఘమిత్రలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్‌ఎం తదితరులు

కుప్పం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం టీడీపీ కార్యాలయంలో బుధవారం కుప్పం నియోజకవర్గం కంగుంది పంచాయతీకి చెందిన పలువురికి టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. కంగుంది పంచాయతీ తిర్లాబండ గ్రామానికి చెందిన ఆనంద్ ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. ఆయనకు హాస్పిటల్ ఖర్చులకుగాను రూ.53 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ జరిగింది. అలాగే ఇదే పంచాయతీ సాహెబ్‌పురం గ్రామానికి చెందిన షేక్ చాందినీ ప్రమాదంలో గాయపడగా ఆమెకు రూ.78 వేలు విలువ గల చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీఎస్.మునిరత్నంలు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని బాధితులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదుకుంటున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి మహేంద్ర, ఏపీ.రవి, కంగుంది టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆధునిక పరికరాల పంపిణీ


దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి రైస్ బయోనిక్స్ సంస్థ, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, జాయినింగ్ ద డాట్స్ సంస్థల ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆధునిక పరికరాలు అందజేశారు. నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన రైస్ బయోనిక్స్ సంస్థ సీఈవో అరుణ్, జాయినింగ్ ద డాట్స్ సంస్థ నిర్వాహకులు ధనంజయ, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ, జ్ఞానేష్, శక్తి, లోకేష్, సంఘ సేవకులు శ్రీపురం సీతారామయ్య, తులసినాథంనాయుడు, భవిత సిబ్బంది, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ


ఉచిత పుస్తకాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వాసుదేవరెడ్డి తదితరులు

కుప్పం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' అనే ప్రభుత్వ పథకం కింద పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు, వారి ఉన్నత ఆశయాలు నెరవేర్చుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచిత పుస్తకాల పంపిణీని చేపడుతోందని చెప్పారు. విద్యార్థులకు చదువు భారం కాకుండా ఉండేందుకు ఈ పథకం తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయాధికారి పి.ధరణి కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో వైద్యాధికారి విజయచందర్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. గర్భిణులు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని, ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు చేసుకోవాలని సూచించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న మహతి ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు షాలిని, సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు తిమ్మక్క, శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలో సోలార్
విద్యుత్ ప్లాంటుకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న షణ్ముగం

చౌడేపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణకు సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగం అన్నారు. బుధవారం ఆయన చౌడేపల్లెలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈనెల 6న 'ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'పల్లె అందం పరుగులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన జిల్లా అధికారులు పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తే ఈకో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంగా మారి ఆదర్శవంతంగా ఏర్పాటవుతుందన్నారు. జిల్లా వనరుల కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. గత 20 రోజుల్లో సేకరించిన చెత్తను విక్రయించగా రూ.17.5 వేలు ఆదాయం పంచాయతీకి సమకూరినట్లు పేర్కొన్నారు. ఈవోపీఆర్డీ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్, నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రావణ వాహనంపై సోమేశ్వరస్వామి విహారం

పుంగనూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమీందారు ప్యాలెస్ ఆవరణలో వెలసిన సోమేశ్వరస్వామి బుధవారం రావణ వాహనంపై ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారిని ప్రత్యేక పల్లకీలో ప్రతిష్ఠించి మంగళవాయిద్యాల మధ్య పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి మంగళ హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ పరిసరాల్లో ఆక్రమణలు తొలగించాలి



పలమనేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని మారెమ్మ గుడి పరిసరాల్లో రోడ్డుపై ఆక్రమణలు తొలగించి భక్తులకు అసౌకర్యాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే పలమనేరులోని శివాలయం వద్ద, బాలికోన్నత పాఠశాల వద్ద, మున్సిపల్ రోజ్‌గార్ వాణిజ్య సముదాయం ముందు, గంగమ్మగుడి వీధిలోనూ ఆక్రమణలు తొలగించారని.. మారెమ్మ గుడి వద్ద తొలగించలేదని భక్తులు తెలిపారు. రోడ్డుపైనే ఆలయం వద్ద దుకాణాలు పెట్టుకోవడంతో గుడికి వచ్చిన భక్తులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారని.. తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సదుం మండలం కలకటవారిపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బుధవారం పులిచెర్ల తహసీల్దార్ జయసింహకు మాల మహానాడు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు దుర్గాప్రసాద్, ధరణికుమార్ మాట్లాడుతూ గ్రామంలో తొలగించిన స్థానంలో మళ్లీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు నాయకులు వినయ్‌కుమార్, బాల గంగాధర్, ఆనంద్, శ్రీనివాసులు, రోహిత్, గిరిబాబు, అమర్‌నాథ్, శ్రీహరి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించండి

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లోనే మీ పిల్లలను చేర్పించండి అంటూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్‌ను డీఈవో వరలక్ష్మి బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ప్రయోజనాలను వివరిస్తూ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు యూటీఎఫ్ చేపట్టిన కార్యక్రమాన్ని నాయకులు రమణ, సోమశేఖరం, మణిగండన్, రెహానాబేగం, రెడ్డప్ప, బాషా, పార్థసారథిలు డీఈవోకు వివరించారు.

యాళి వాహనంపై కోదండరాముడి విహారం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పల్లకి, యాళి వాహనాలపై స్వామివారు విహరించారు. ఉదయం ఈవో సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో కందబాబు, రామనుజులుశెట్టి, ప్రగతి బుక్‌స్టోర్స్ ఉభయంతో పల్లకిలో మోహినీ అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు.

ప్రజా దర్బార్‌కు 68 అర్జీలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రజాదర్బార్‌కు 68 అర్జీలు అందాయి. బుధవారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. వీటిల్లో నీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్యం, భూ సమస్యలు, ఫించన్లు వంటివి ఉన్నాయి.

పేదరికాన్ని పారదోలే దివ్య ఔషధం విద్య: భానుప్రకాష్



ఎన్‌సీసీ క్యాడెట్‌కు ట్రోఫీ, ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని పారదోలే దివ్య ఔషధం విద్య అని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థి దశ వ్యక్తి జీవితంలో అత్యంత ప్రాధాన్యమైందన్నారు. విద్యతోపాటు ఆటలు, పాటలతో భవిష్యత్తుకు గట్టి పునాదిని వేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. కలాశాల 150 మందితో తాత్కాలిక నిర్మాణాలతో ప్రాంభమై నేడు సొంతభవనాలతోపాటు న్యాక్ ఏ+గ్రేడ్ సాధించి స్వతంత్ర ప్రతిపత్తిని సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయొద్దు: యూటీఎఫ్

3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయొద్దని, దీనికి సంబంధించిన జీవోను రద్దు చేయాలని యూటీఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా కార్యదర్శి మణిగండన్, రాష్ట్ర కౌన్సిలర్ పీఆర్ మునిరత్నం పాల్గొన్నారు.

జూనియర్ రెడ్‌క్రాస్ బృందానికి కలెక్టర్ అభినందన



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో పోటీల్లో అవార్డులు సాధించిన జూనియర్ రెడ్‌క్రాస్ బృందాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం అభినందించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో ఈకార్యక్రమం జరిగింది. డీఆర్వో మోహన్‌కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ రమేష్‌బాబు, కోశాధికారి తేజోమూర్తి, సభ్యులు అరుణకుమారి, సహదేవనాయుడు, చిరంజీవి, చౌదరి, ఏవో గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఐడీఆర్ఎఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను బాధిత కుటుంబాలకు ఎస్పీ మణికంఠ అందించారు. అనారోగ్యంతో మృతి చెందిన కార్వేటినగరం హెడ్ కానిస్టేబుల్ కుబేంద్రన్ సతీమణి శివాణికి, అలాగే ఎస్ఆర్‌పురం కానిస్టేబుల్ ఆనందబాబు సతీమణి మాధవికి కూడా రూ.లక్ష చొప్పున రెండు చెక్కులను ఎస్పీ అందజేశారు.

పారిశుధ్య నిర్వహణకు సహకరించండి: డీపీవో

వెదురుకుప్పం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణకు అందరూ సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) కె.సుధాకరరావు కోరారు. బుధవారం కార్వేటినగరం మండలంలోని కార్వేటినగరం, సురేంద్రనగరం పంచాయతీల్లో చేపడుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత కార్యదర్శినే బాధ్యుడని చేస్తామని చెప్పారు. అలాగే డీఎం పురం చెత్త సేకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయుర్వేద వైద్యశాలను సందర్శించారు. కార్వేటినగరం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో చంద్రమౌళి, ఈవోపీఆర్డీ నాగరత్నమ్మ ఆయన వెంట ఉన్నారు.

సర్వర్ నెమ్మదించడంతో తిప్పలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ బుధవారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నెమ్మదించడంతో క్రయ, విక్రయదారులకు తిప్పలు తప్పలేదు. స్లాట్ బుకింగ్ విధానం వల్ల రిజిస్ట్రేషన్‌లు ఎక్కువగా జరుగుతుండటంతో సర్వర్ నెమ్మదించింది. సాయంత్రం నాలుగు గంటల తర్వాత వేగం పుంజుకుంది. మిగిలిన కార్యాలయాల్లో ఇబ్బందులు తలెత్తలేదు.

రుణాలు చెల్లించని డ్వాక్రా సంఘాలపై కఠిన చర్యలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించని డ్వాక్రా సంఘాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో బుధవారం డీఆర్‌డీఏ ద్వారా అమలవుతున్న పథకాలపై ఏపీఎంలతో సమీక్షించారు. పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

డీఎఫ్‌వో బంగ్లాలో నాగుపాము కలకలం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డీఎఫ్‌వో భరణి బంగ్లాలోకి మంగళవారం రాత్రి నాగుపాము కలకలం రేపింది. బంగ్లా ఆవరణలోని గుడిసె వద్ద నాగుపాము ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. స్నేక్ క్యాచర్ ఖల్‌నాయక్‌కు సమాచారం ఇవ్వగా, ఆయనొచ్చి ఆ పామును పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో అక్కడి అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

'తానా' విజేతకు సన్మానం



వెదురుకుప్పం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తానా నవలల పోటీల్లో బాలసాహిత్య విభాగంలో బహుమతి గెలుచుకున్న వెదురుకుప్పం యువ రచయిత పేట యుగంధర్‌కు బుధవారం తిరుపతిలో సన్మానం జరిగింది. తిరుపతి జిల్లా రచయితల సంఘం, వేమన విజ్ఞాన కేంద్రం వారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యుగంధర్ రచించిన 'జాను అనే నేను, నా స్నేహితురాళ్లు' నవలకు రూ.15వేల బహుమతి లభించింది. తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి చేతులమీదుగా సన్మానించారు. సాహితీ ప్రియులు దామోదరనాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, డాక్టర్ మన్నవ గంగాధరప్రసాద్, ఏనుగు అంకమనాయుడు, ఆచార్య సర్వోత్తమరావు, టెంకాయల దామోదర్, ఆర్‌సీ కృష్ణస్వామిరాజు, డాక్టర్ మస్తానమ్మ పాల్గొన్నారు.

రేపు కొట్రకోనలో మల్లేశ్వరుడి కల్యాణం

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొట్రకోన గ్రామంలోని పార్వతీ సమేత మల్లేశ్వరస్వామికి శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి 10.30 గంటల వరకు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, ప్రధాన కార్యదర్శి యుగంధరాచారి తెలిపారు.

మౌలిక వసతులకు పెద్దపీట



మొలకమడుగులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరాపల్లె పంచాయతీ మొలకమడుగు గ్రామంలో రూ.10లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలతో కలిసి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు పెద్దపీట వేస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురార్జీ యాదవ్, వెంకటేష్ రవీ, హేమగిరి, చిత్ర, వల్లేరు అమర్‌నాథ నాయుడు, ధరణి ప్రకాష్, గుణశేఖర్, గోపిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో నాయకులు కూడా కార్యకర్తలే: జగన్మోహన్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో నాయకులు కూడా కార్యకర్తలేనని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో పార్టీ సభ్యత్వం తీసుకున్న నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీలో సభ్యత్వం పొందడం గర్వకారణంగా ఉందని చెప్పారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు వట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే అధిక నిధులను వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. పార్టీలో కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు సునీల్ కుమార్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రజా దర్బార్‌కు 68 అర్జీలు: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రజా దర్బార్‌కు 68 అర్జీలు అందాయి. బుధవారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. వీటిల్లో నీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్యం, భూ సమస్యలు, పింఛన్లు వంటివి ఉన్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, తహసీల్దార్లు జయంతి, లోకేశ్వరి, ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం: మురళీమోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధానమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. బుధవారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. 57 అర్జీలను స్వీకరించారు. పూతలపట్టు, బంగారుపాళ్యం, యాదమరి, తవణంపల్లె, ఐరాల మండలాల టీడీపీ అధ్యక్షులు దొరబాబు, ఎన్‌వీ జయప్రకాష్, మురార్జీ యాదవ్, గాలి దిలీప్ కుమార్, గిరిధర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

కిడ్నీ బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు బుధవారం అందజేశారు. బంగారుపాళ్యం మండలం కూర్మానిపల్లెకు చెందిన కిడ్నీ బాధితుడు మేకల శంకర్ రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2,06,900 మంజూరైంది. ఈ చెక్కును తన కార్యాలయంలో బాధితునికి ఎంపీ అందజేశారు.

వైభవంగా కరకంఠేశ్వరుడి రథోత్సవం



నగరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. పంగుణి ఉత్సవాల్లో భాగంగా ఈ వేడుక జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దాదాపు మూడు గంటలపాటు రథోత్సవం సాగింది. ఈ సందర్భంగా కోలాటాలు, మంగళవాయిద్యాలు, శివపురాణ పఠనం అలరించాయి. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. ఉభయదారులు కోనేరు అమృతమ్మ, సుబ్రహ్మణ్యం మొదలియార్, ఆలయధర్మకర్త సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కమనీయం అగస్త్యేశ్వరుడి కల్యాణోత్సవం



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అగస్త్యేశ్వరాలయంలో స్వామి, అమ్మవార్లకు నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. అంతకుముందు ఈవో వెంకటరాయలు ఆధ్వర్యంలో అర్చకుడు శివకుమార్ శివాచార్యులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆర్.నరసింహులు శెట్టి, సునీల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్, జీఎస్‌కేవీ ప్రసాద్ ఉభయంతో నగరంలో భిక్షాండి ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం నగర బలిజ సేవా సంఘం నాయకులు వీకే విశ్వనాథ్, ఓ.రాందాస్, ఆరణి తులసిరాం, పూల సుబ్రహ్మణ్యం, డీకే బద్రీనాథ్, తదితరుల ఉభయంతో అశ్వవాహనసేవ జరిగింది. కాలభైరవ ట్రస్టు వ్యవస్థాపకుడు టి.వెంకటేషన్, లత జ్యువెలర్స్ అధినేతలు మల్లి ఆచారి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

యాళి వాహనంపై కోదండరాముడి విహారం



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పల్లకి, యాళి వాహనాలపై స్వామివారు విహరించారు. ఉదయం ఈవో సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో కందబాబు, రామనుజులుశెట్టి, ప్రగతి బుక్‌స్టోర్స్ ఉభయంతో పల్లకిలో మోహినీ అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. సాయంత్రం సాయి సంజన టెక్స్‌టైల్స్, పి.రమేష్ కుటుంబీకుల ఉభయంతో యాళి వాహన సేవ జరిగింది. అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

శేష వాహనంపై రాములోరి రాజసం



తవణంపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అరగొండ కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సీతా సమేతుడైనా రామచంద్రమూర్తి శేష వాహనంపై పుర వీధుల్లో విహరించారు. ఆలయ అర్చకుడు ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌లకు పాలాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

ఐటీఐలో 15న అప్రెంటీస్‌షిప్ మేళా

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళాను ఈనెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు.

పెంచిన పెట్రోల్ ధరలను తగ్గించాలి: సీపీఐ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం పెంచిన పెట్రోలు, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 11 ఏళ్లు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ధరలను ఇలా పెంచడం సరికాదన్నారు. నాయకులు మణి, విజయకుమార్, జామిలాబీ, కవిత, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యువత టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి: థామస్



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యువత టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ విప్ థామస్ పిలుపునిచ్చారు. వ్యవసాయశాఖ తరఫున విజయవాడలో డ్రోన్ శిక్షణను పాతపాళ్యం దళితవాడకు చెందిన టీడీపీనేత టి.రవి కుమారుడు చంద్రశేఖర్ పూర్తి చేసుకుని వచ్చారు. ఈసందర్భంగా పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు ఈ విషయాన్ని థామస్‌కు తెలిపారు. శిక్షణ పూర్తయినట్లు అధికారులకు అందిన సర్టిఫికెట్‌ను చంద్రశేఖర్‌కు ప్రభుత్వవిప్ మంగళవారం అందజేసి, అభినందించారని బుధవారం కృష్ణమనాయుడు తెలిపారు.

'ప్రభుత్వ బడుల్లోనే మీ పిల్లలను చేర్పించండి'

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లోనే మీ పిల్లలను చేర్పించండి అంటూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్‌ను డీఈవో వరలక్ష్మి బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ప్రయోజనాలను వివరిస్తూ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు యూటీఎఫ్ చేపట్టిన కార్యక్రమాన్ని నాయకులు రమణ, సోమశేఖరం, మణిగండన్, రెహానాబేగం, రెడ్డప్ప, బాషా, పార్థసారథిలు డీఈవోకు వివరించారు.

'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' ఆడియో లాంచ్ ఏర్పాట్ల పరిశీలన



పోలీసులకు, నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్/పూతలపట్టు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా ఆడియో లాంచ్ కోసం ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కాలేజీలో చేసిన ఏర్పాట్లను బుధవారం ఎస్పీ మణికంఠ పరిశీలించారు. కళాశాల వైస్ చైర్మన్ శ్రీనివాసులు, ఏఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి బందోబస్తు ఏర్పాట్లపై సూచనలిచ్చారు. కాలేజీ వలంటీర్లు, ఇతర నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.

పటిష్ఠ బందోబస్తు: చిత్తూరు - కడప జాతీయ రహదారి నుంచి కళాశాల ఆవరణం మొత్తం పటిష్ఠ పోలీసు బందోబస్తును ఎస్పీ ఏర్పాటు చేశారు. స్టేజి వద్ద కూడా స్పెషల్ పోలీసులను నియమించి.. చిన్న పొరపాటుకు కూడా తావివ్వలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు సినీహీరో కల్యాణ్‌రామ్, సీనియర్ నటి విజయశాంతిలు పోలీసులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్, ఇన్‌చార్జి డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ సుధాకర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వాహనం ఢీకొని సైక్లిస్టు దుర్మరణం



పార్థసారథి మృతదేహం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ సైక్లిస్టు దుర్మరణం చెందాడు. నగరంలోని బాపుబాలభవన్‌కు సమీపంలో పార్థసారథి కుటుంబం నివాసం ఉంటోంది. బుధవారం రాత్రి సైకిల్ తొక్కుకుంటూ తిరుపతి వైపు బయల్దేరాడు. షుగర్ ఫ్యాక్టరీ బ్రిడ్జిపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. క్రమం తప్పకుండా సైక్లింగ్ చేసే పార్థసారథి మృతిపై చిత్తూరు నగర సైక్లింగ్ రైడర్స్ నేతలు డాక్టర్లు భరత్‌రెడ్డి, సునీల్, జయంత్, అన్నామలై. వినోద్, సురేంద్రరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

కల్వర్టు పైనుంచి పడి వృద్ధుడి మృతి



చెంగల్రాయులు మృతదేహం

చంద్రగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గంగుడుపల్లె వద్ద ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తూ కల్వర్టు పైనుంచి పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం మొండి వెంగనపల్లెకు చెందిన చెంగల్రాయులు(65) బుధవారం సొంత పనుల నిమిత్తం చంద్రగిరికి వచ్చాడు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు పక్కన కల్వర్టుపై కూర్చొని ఆటో కోసం ఎదురుచూస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. స్థానికుల సమచారంతో మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు పోలీసులు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు విషయంలో గొడవ

పెనుమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విషయంలో గొడవ జరిగింది. బుధవారం సిమెంటు రోడ్డు వేస్తుండగా తమ పట్టా భూమి అంటూ గిరి, సుబ్రహ్మణ్యం నాయుడు, కిరణ్‌నాయుడు అడ్డుకుని తమపై చేయి చేసుకున్నారని సామిరెడ్డిపల్లె దళితవాడకు చెందిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ భూమిపై తహసీల్దారును వివరణ కోరగా.. దళితవాడకు వెళ్లే దారి కొతవరకు పట్టా భూమిలో ఉందన్నారు. మరోవైపు ఇదే గ్రామానికి చెందిన ఉషాదేవి కూడా తమ పట్టాభూమిలో దళితులు రోడ్డు వేస్తున్నారని అడ్డుకున్నందుకు గొడవ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను గురువారం పరిశీలిస్తామని హెడ్ కానిస్టేబుల్ మధు తెలిపారు.

భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తన భర్త కనిపించడం లేదంటూ ఓ మహిళ ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంగారెడ్డిపల్లెకు చెందిన మనోజ్‌కుమార్(45) మతిస్థిమితం లేదు. అప్పుడప్పుడూ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో గత ఏడాది జూలైలో ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో బుధవారం ఆయన భార్య ప్రియదర్శిని ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పదిమంది పేకాటరాయుళ్ల అరెస్టు

పూతలపట్టు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎం.బండపల్లె గ్రామ సమీపాన ఓ మామిడి తోటలో పేకాడుతున్న పది మందిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8లక్షలు, 15 ద్విచక్రవాహనాలు, 11 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రీసర్వేలో పారదర్శకతకు పెద్దపీట

యాదమరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రీసర్వే తనిఖీలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. బుధవారం కోణాపల్లె గ్రామ సచివాలయం పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించిన రీసర్వే ర్యాలీ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ తులసీధర్ పాల్గొన్నారు.

నింద్ర: రెండో విడత రీ సర్వేపై రైతులకు కేఆర్‌పాలెంలో అవగాహన సదస్సు జరిగింది. తహసీల్దార్ శేషగిరిరావు, ఆర్ఐ ప్రసాద్ రావు, మండల సర్వేయర్ వెంకటేశులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎమ్మెల్యేకు సన్మానం

నింద్ర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను బుధవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో నింద్ర మండలానికి చెందిన నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు సన్మానించారు. తమకు పదవి రావడానికి సహకరించారని నాగభూషణంరాజు, జగన్, రవిరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ చక్రపాణి రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరావు, నాయకులు దశరథ వాసు, భాస్కర్ రెడ్డి, బాబు యాదవ్, రమేష్, మనోజ్‌యాదవ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

యాదమరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి చరిత తెలిపారు. బుధవారం వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బందికి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీఎం ఈశ్వరి, శిక్షకులు కవిత, నీలకంఠ రెడ్డి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పరశురాంరెడ్డి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి సురేఖ, ఎన్‌పీఎం ఎంటీ సుధాకర్‌నాయుడు, డివిజనల్ మాస్టర్ ట్రైనర్ హనుమంతురెడ్డి, డీఎంఎంటీ సురేష్ పాల్గొన్నారు.

పేడ దిబ్బలు తొలగించాలి

పాలసముద్రం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్డు పక్కన పేడ దిబ్బలు తొలగించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి ఆదేశించారు. బుధవారం పాలసముద్రం కాలనీలో ప్రాథమిక పాఠశాలకు సమీపంలో పిచ్చి మొక్కలు, పేడ దిబ్బలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. సర్పంచ్ అయ్యప్పన్, ఈవోపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ట్రాక్టర్లు నడపొద్దు

పాలసముద్రం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ట్రాక్టర్లు నడపవద్దని ఎస్ఐ చిన్న రెడ్డెప్ప ఆదేశించారు. బుధవారం పాలసముద్రం పోలీస్ స్టేషన్ ఆవరణంలో ట్రాక్టర్ యజమానులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెళ్లిళ్ల తదితర కార్యక్రమాలకు ట్రాక్టర్లలో జనాన్ని ఎక్కించుకోవద్దని చెప్పారు. వాహనానికి సంబంధించిన రికార్డులన్నీ పక్కాగా ఉండాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

125 మందికి వైద్య పరీక్షలు

తవణంపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అరగొండ అపోలో ఆస్పత్రిలో బుధవారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 125 మంది మహిళలకు గైనకాలజీ వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. 10 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని ఆస్పత్రి మేనేజరు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వైద్యులు కీర్తన, వినోద్, పీఆర్వో కమరుద్దీన్ పాల్గొన్నారు.

ఒకటో పట్టణ సీఐగా మహేశ్వర్



చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఒకటో పట్టణ సీఐగా మహేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా ఉన్న జయరామయ్యను ప్రభుత్వం వీఆర్‌కు తీసుకోగా.. ఆయన స్థానంలో దిశా పోలీసు స్టేషన్ సీఐగా ఉన్న మహేశ్వర్‌ను ఇన్‌చార్జి సీఐగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



తిరుపతిలో మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్